# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 291 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 15 అక్టోబర్ 2026


**ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు**



3లో

**దివ్యాంగుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం**

**మై భారత్, ఎస్ఆర్డీఎస్, ఎనేబుల్ ఇండియా కృషి**



3లో

### కనకదుర్గమ్మను దర్శించుకున్న

# రాష్ట్రపతి ముర్ము

- ప్రత్యేక పూజల అనంతరం వేదాశీర్వచనం.. రాష్ట్రపతికి ఆలయ అధికారుల సత్కారం



2లో

### కల్తీ నెయ్యి కేసులో రూ.130 కోట్ల

# ఆస్తులు జప్తు

- తిరుమల లడ్డూ వ్యవహారంలో కీలక పరిణామం



2లో



2లో

### బతుకమ్మ నాటికి

# ఇందిరమ్మ ఇళ్లు

అర్హులందరికీ పారదర్శకంగా కేటాయింపు: మంత్రి పొంగులేటి



2లో

### అమెరికాలో పని అనుమతుల

# పొడిగింపు రద్దు

- భారతీయ ఉద్యోగులపై ప్రభావం



### ప్రపంచ పారిశ్రామికవేత్తలుగా

# ఎదగాలి

- యువత, మహిళలకు ప్రభుత్వ సహకారం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ పారిశ్రామికవేత్తలు ఇతర సంస్థలకు సేవలందించే స్థాయి నుంచి ఎదిగి, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలుగా మారాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించేలా వ్యాపారాలను విస్తరించాలని సూచించారు. యువతతోపాటు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిం చేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య వాణిజ్య సదస్సు2026ను ఆయన ప్రారంభించారు. మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మిగతా2లో...

### పర్యాటక కేంద్రంగా

# అచ్చంపేట

- నల్లమల అభివృద్ధితో ప్రాంతానికి కొత్త కళ.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**అచ్చంపేట,అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రాంతాన్ని భవిష్యత్తులో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. నల్లమలలో ఎత్తైన రహదారి మార్గం, కృష్ణానదిపై వంతెన, బుల్లెట్ రైలు మార్గానికి సంబంధించిన ప్రతిపాదిత పనులు కార్యరూపం దాలిస్తే ఈ ప్రాంతానికి మరింత ప్రాధాన్యం పెరుగుతుందని పేర్కొన్నారు. బుధవారం అచ్చంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.మన్ననూరు వద్ద రూ.53.84 కోట్ల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రానికి, అమ్రాబాద్ నుంచి మద్దిమడుగు వరకు చేపట్టనున్న రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. మిగతా2లో...

### సింగరేణిలో అవినీతి పెరిగింది..

# ఉత్పత్తి తగ్గింది

- కార్మిక గర్జన సభలో కేటీఆర్ ఆరోపణలు



**గోదావరిఖని,అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి సంస్థలో అవినీతి పెరిగిపోయిందని, బొగ్గు ఉత్పత్తి గణనీయంగా తగ్గిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖనిలోని జవహర్‌లాల్ స్టేడియంలో నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కార్మికుల వల్ల సంస్థకు నష్టం జరగలేదని, ప్రభుత్వ విధానాలే సింగరేణి ప్రస్తుత పరిస్థితికి కారణమని విమర్శించారు. **70 నుంచి 58 మిలియన్ టన్నులకు తగ్గిన ఉత్పత్తి** భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో 2023లో మిగతా2లో...

### ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా

# భారీ ర్యాలీ

- రెండు లక్షల మందితో హైదరాబాద్‌లో ప్రదర్శన: మహేశ్ కుమార్ గౌడ్



2లో



### ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టును

# ఆశ్రయించిన ఓవైసీ

ఓటర్ల హక్కులకు భంగం కలగకూడదని వ్యాజ్యం

**హైదరాబాద్,అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్)::** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సవాలు చేస్తూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఓటర్ల పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో మిగతా2లో...

### కవలలు పుట్టినా 180 రోజుల

# ప్రసూతి సెలవు

మహిళా ఉద్యోగికి అనుకూలంగా ఉన్నత న్యాయస్థానం తీర్పు




2లో

# ప్రపంచ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో మహిళలకు రూ.61 వేల కోట్ల మేర బ్యాంకు అనుసంధాన రుణాలు అందించినట్లు తెలిపారు. మహిళలను ప్రజా రవాణా బస్సులు, ఇంధన విక్రయ కేంద్రాలు, సౌర విద్యుత్ కేంద్రాల నిర్వహణలో భాగస్వాములను చేస్తున్నామని వివరించారు.**తెలంగాణకు భారీ ఆర్థిక లక్ష్యాలు**2034 నాటికి తెలంగాణను ఒక లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తిలో ప్రస్తుతం తెలంగాణ వాటా ఐదు శాతంగా ఉందని, దానిని పది శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నూతన పారిశ్రామిక విధానంలో యువత, మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.**అభివృద్ధిలో సమాఖ్యల పాత్ర కీలకం**ఆధునిక కాలంలోనూ సమాఖ్యల పాత్ర ఎంతో ముఖ్యమని ముఖ్యమంత్రి అన్నారు. అనుభవజ్ఞుల విజయగాథలను భద్రపరిచి, కొత్త తరానికి అందించాలని సూచించారు. యువత సినిమా, రాజకీయాలు సహా వివిధ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు పరిమితం కావాలని, ఆ తర్వాత అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార పక్షం, ప్రతిపక్షం పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి కె. రఘురామకృష్ణరాజు, ఎంపీలు కె. లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ నాటికి ఇందిరమ్మ ఇళ్లు

**హైదరాబాద్, అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** అర్హులైన పేదలకు రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. వచ్చే ఏడాది బతుకమ్మ పండుగ నాటికి తొలి విడతలో ఎంపికైన లబ్ధిదారులకు ఇందిరమ్మ టవర్లలో ఇళ్లను అప్పగించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని పోచారంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.తొలి విడతలో మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మంత్రి వెల్లడించారు. బహిరంగ లాటరీ ద్వారా పారదర్శకంగా గృహాలను కేటాయిస్తామని, లబ్ధిదారులకు ఇంటితోపాటు భూమిలో వాటాపై హక్కులు కల్పిస్తామని చెప్పారు. గృహాల రిజిస్ట్రేషన్‌ను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.హైదరాబాద్ పరిధిలోని పట్టణ ప్రాంతాల్లో తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 23 నియోజకవర్గాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయినట్లు మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిన రెండు పడకగదుల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.440 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

# యాసంగిలో వరి సాగు తగ్గే అవకాశం

### - పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):**

రానున్న యాసంగి కాలంలో వరి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉన్నందున పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పంట వ్యర్థాలను కాల్చకుండా పశు గ్రాసంగా వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.వానాకాలంలో లభించే పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి నిల్వ చేయాలని, జిల్లాల్లో పశుగ్రాసం అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొ నేందుకు అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన ఈ సూచ నలు చేశారు.వ్యవసాయంలో నూతన సాంకేతికతను వినియో గించి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు.

# సింగరేణిలో అవినీతి పెరిగింది.. ఉత్పత్తి తగ్గింది

(మొదటి పేజీ తరువాయి)

సింగరేణి సంస్థ 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, 202526 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని కేటీఆర్ పేర్కొ న్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంధువుల జోక్యం, పైమట్టి తొలగింపు పనుల ఒప్పందాల్లో జాప్యం కారణ ంగా ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడ్డాయని ఆరోపించారు. సింగరేణిని బలహీనపరిచి ప్రైవేటీక రణకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం చూస్తోం దని విమర్శించారు.**రూ.60 వేల కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?** సింగరేణికి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.60 వేల కోట్లకు చేరాయని కేటీఆర్ అన్నారు. సంస్థ వద్ద గతంలో భారీగా నిధులు ఉండేవని, ప్రస్తుతం అప్పులు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. మూసీ నది అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం సింగరేణి బకాయిలను ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. బొగ్గు ఉత్పత్తి తగ్గడంతో విద్యుత్ సరఫరాపైనా ప్రభావం పడుతోందని అన్నారు. **కార్మికుల సమస్యలు పరిష్కరించాలి** సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటాను పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వైద్య మండలి సమావేశాలను ప్రతి నెలా మూడుసార్లు నిర్వహించి, అర్హులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సంస్థకు లేదా కార్మికులకు నష్టం జరిగితే భారత రాష్ట్ర సమితి చూస్తూ ఊరుకోదని, అవసరమైతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.సింగరేణి తెలంగా ణకు కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థ అని పేర్కొన్న కేటీఆర్.. సంస్థను కాపాడుకోవడం, కార్మికుల హక్కుల ను పరిరక్షించడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ సభలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, చందర్ పాల్గొన్నారు.

# కవలలు పుట్టినా 180 రోజుల ప్రసూతి సెలవు

### • మహిళా ఉద్యోగికి అనుకూలంగా ఉన్నత న్యాయస్థానం తీర్పు




**హైదరాబాద్,అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** మొదటి ప్రసవంలో కవలలు జన్మించినప్పటికీ, రెండో ప్రసవా నికి 180 రోజుల ప్రసూతి సెలవు మంజూరు చేయా ల్సిందేనని తెలంగాణ ఉన్నత న్యాయస్థానం కీలక తీర్పు ఇచ్చింది. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం మఖ్దంపూర్ పాఠశాలలో ఉపాధ్యాయు రాలిగా పనిచేస్తున్న వి. నర్మదకు అనుకూలంగా న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెకు రెండో ప్రసవానికి 180 రోజుల సెలవు మంజూరు చేయడంతోపాటు, ఆ కాలానికి పూర్తి వేతనం చెల్లించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. నర్మద రెండో ప్రసవం కోసం 2026 సెప్టెంబరు 21న ప్రసూతి సెలవుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఆమెకు మొదటి ప్రసవంలోనే కవలలు జన్మించడంతో ఇద్దరు పిల్లలు ఉన్నారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇద్దరి కంటే తక్కువ మంది పిల్లలు ఉన్న మహిళా ఉద్యోగులకే ప్రసూతి సెలవు వర్తిస్తుందని పేర్కొంటూ ఊట్కూర్ మండల విద్యాశాఖ అధికారి ఆమె దరఖాస్తును తిరస్కరించారు. దీంతో తనకు సెలవు నిరాకరిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ నర్మద ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం సహకారంతో ఆమె న్యాయస్థానంలో వ్యాజ్యం దాఖలు చేశారు. నర్మద తరపున సీనియర్ న్యాయవాది ఖాసీం భాషా వలి వాదనలు వినిపించారు. ప్రభుత్వ ఉద్యోగంలో చేరకముందు జరిగిన మొదటి ప్రసవంలో కవలలు జన్మించినప్పటికీ, రెండో ప్రసవానికి ప్రసూతి సెలవు పొందేందుకు ఆమెకు అర్హత ఉందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఇదే అంశంపై గతంలో వెలువడిన తీర్పులను కూడా ప్రస్తావించారు.ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన న్యాయస్థానం, ప్రసూతి సెలవుల నిబంధనలను మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేయాలని స్పష్టం చేసింది. కవలలు జన్మించడం సహజమైన జీవ ప్రక్రియ అని, అది మహిళ నియంత్రణలో ఉండే అంశం కాదని పేర్కొంది. కుటుంబ నియంత్రణ నిబంధనల పేరుతో మహిళలకు లభించే మాతృత్వ హక్కులను కుదించలేమని వ్యాఖ్యానించింది.తమిళనాడులో ఇదే అంశంపై వెలువడిన తీర్పు అనంతరం అక్కడి ప్రభుత్వం నిబంధనలను సవరించిన విషయాన్ని న్యాయస్థానం గుర్తుచేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా 2025లో సంబంధిత నిబంధనల్లో మార్పులు చేసిన అంశాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో తొలి ప్రసవంలో కవలలు జన్మించిన మహిళ రెండో ప్రసవానికి కూడా ప్రసూతి సెలవు పొందేందుకు అర్హురాలని స్పష్టం చేసింది. నర్మద సెలవు దరఖాస్తును తిరస్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను నిలిపివేసి, 180 రోజుల సెలవు మంజూరు చేయడంతోపాటు ఆ కాలానికి పూర్తి వేతనం చెల్లించాలని ఆదేశించింది.ఈ తీర్పుపై రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పింఛను పథకం ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్, నారాయణపేట జిల్లా నాయకులు కృపాకర్ రెడ్డి, మహాదేవ్, రాఘవేంద్రాచారి, సత్యపాల్, ఊట్కూర్ మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు ఉపాధ్యాయురాలికి అనుకూలంగా తీర్పు రావడం సంతోషకరమని తెలిపారు. ఈ అంశంపై న్యాయస్థానంలో పోరాడి విజయం సాధించిన నర్మదను అభినందించారు.మహిళా ఉద్యోగుల మాతృత్వ హక్కులను పరిరక్షించడంలో ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుందని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ప్రసూతి సెలవులు తల్లి ఆరోగ్యం, శిశువు సంరక్షణకు ఎంతో అవసరమని తెలిపారు. మహిళా ఉద్యోగుల పట్ల సంక్షేమ దృక్పథంతో వ్యవహరించాలని, నిబంధనలను అమలు చేసే సమయంలో సహజ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

# కనకదుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము

**విజయవాడ,అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):**భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవా డలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న రాష్ట్రపతి అమ్మవారిని దర్శించుకుని అంతరాలయంలో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు పట్టువస్త్రాలు, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటాన్ని అందించి గౌరవించారు.అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ ఆమెకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనిత, కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లు స్వాగతం పలికారు. రాష్ట్రపతి రోడ్డు మార్గంలో విజయవాడకు చేరుకున్నారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారి దర్శనానికి వచ్చిన రాష్ట్రపతికి హోంమంత్రి అనిత, ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. దర్శనానంతరం రాష్ట్రపతి ఆలయ పరిసరాల్లోని క్యూలైన్లలో ఉన్న భక్తులకు నమస్కరిస్తూ ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఆలయ అధికారులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు.శ్రీ కనకదుర్గమ్మ దర్శనం సందర్భంగా నిర్వహించిన పూజలు, అర్చకుల వేదాశీర్వ చనం, ఆలయ అధికారులు అందించిన గౌరవ సత్కారాలు పర్యటనలో ప్రధాన ఘట్టాలుగా నిలిచాయి.

# కల్తీ నెయ్యి కేసులో రూ.130 కోట్ల ఆస్తులు జప్తు

**అమరావతి,అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఆరోపణల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బోలేబాబా ఆర్గానిక్ డెయిరీ, శ్రీ వైష్ణవి డెయిరీ, సుకృతి ఫుడ్స్ సంస్థలకు చెందిన రూ.129.85 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. సంస్థల నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తులపైనా చర్యలు చేపట్టింది.దేవస్థానానికి సుమారు రూ.234.5 కోట్ల విలువైన కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని అధికారులు తెలిపారు. నెయ్యి తయారీలో శుద్ధి చేసిన పామాయిల్, ఇతర నూనెలు, రసాయన పదార్థాలను వినియోగించి, వాటిని నెయ్యిగా సరఫరా చేసినట్లు ఆరోపించారు. నకిలీ కొనుగోళ్లు, అమ్మకాల ద్వారా లావాదేవీలను నిజమైనవిగా చూపించారని పేర్కొన్నారు. బ్యాంకుల ద్వారా చెల్లించిన మొత్తాలను హవాలా మార్గంలో నగదు రూపంలో వెనక్కి మళ్లించినట్లు అనుమానిస్తున్నారు.ఈ కేసులో బోలేబాబా సంస్థకు చెందిన విపిన్ జైన్, సుకృతి ఫుడ్స్ నిర్వాహకుడు కైలాష్ చంద్ర మంగ్లాను అధికారులు గతంలో అరెస్టు చేశారు. తాజా చర్యతో ఈ కేసులో జప్తు చేసిన, స్వాధీనం చేసుకున్న, నిలిపివేసిన ఆస్తుల మొత్తం విలువ రూ.132.55 కోట్లకు చేరింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు కొనసాగుతోంది.

# అమెరికాలో పని అనుమతుల పొడిగింపు రద్దు

**వాషింగ్టన్:అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** అమెరికాలో పని అనుమతి పత్రాల గడువు ముగిసిన తర్వాత కూడా గరిష్ఠంగా 540 రోజుల వరకు ఉద్యోగం కొనసాగించే స్వయంచాలక వెసులుబాటును ప్రభుత్వం తొలగించింది. ఈ నిర్ణయంతో హెచ్-1బీ వీసాదారుల జీవిత భాగస్వాములు సహా అర్హతగల వలస ఉద్యోగులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. పునరుద్ధరణ దరఖాస్తులకు ఆమోదం ఆలస్యమైతే ఉద్యోగ విరామం ఏర్పడవచ్చు. దీంతో భారతీయ కుటుంబాల ఆదాయం, ఉద్యోగ భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఓవైసీ

(మొదటి పేజీ తరువాయి)

అనుసరిస్తున్న విధానాలపై ఆయన అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లోని కొన్ని నిబంధనలు ఇబ్బందికరంగా ఉన్నాయని పేర్కొన్నారు.ఓటర్ల జాబితాల సవరణ చట్టబద్ధంగా, పారదర్శకంగా జరగాలని ఓవైసీ కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అభిప్రాయ పడ్డా రు. ఎన్నికల సంఘం నిర్ణయాలు, సవరణ ప్రక్రియలో అనుసరిస్తున్న విధానాలపై స్పష్టత అవసర మని పేర్కొన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు విచారణ, తదుపరి ఆదేశాలపై ఆసక్తి నెలకొంది.

# పర్యాటక కేంద్రంగా అచ్చంపేట

(మొదటి పేజీ తరువాయి)

పదర మండలం రాయలగండి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద రూ.50 లక్షలతో రాజగోపుర నిర్మాణ పనులను ప్రారంభించారు. బల్మూరు, వంగూరు, రామాజిపల్లి, సిద్దాపూర్ ప్రాంతాల్లోనూ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు.అచ్చంపేట ప్రాంతంతో తమ కుటుంబానికి 46 ఏళ్ల అనుబంధం ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. మారుమూల గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ఉపకేంద్రాలు, విద్యుత్ స్తంభాలు, కొత్త విద్యుత్ మార్పిడి యంత్రాల ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నట్లు వివరించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాతో ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని చెప్పారు.రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటివరకు రూ.1.64 లక్షల కోట్లను పంపిణీ చేసినట్లు ఉప ముఖ్య మంత్రి తెలిపారు. ఉచిత సన్నబియ్యం, రైతు భరోసా, చేయూత పింఛన్లు, ఉచిత విద్యుత్, ఇంది రమ్మ ఇళ్ల పథకాల అమలు వివరాలను వెల్లడించారు. సంక్షేమ పథకాలపై ఎవరితోనైనా చర్చకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ మన్ననూరులో కొత్త విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుతో అమ్రాబాద్, పదర మండలాల ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందు తుందని తెలిపారు. నల్లమల ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి అవసరమైన వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ

### - రెండు లక్షల మందితో హైదరాబాద్‌లో ప్రదర్శన: మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్,అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు వ్యతిరేకంగా, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ దసరా తర్వాత హైదరాబాద్‌లో రెండు లక్షల మందితో భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ కూడా నిర్వహిస్తామని వెల్లడించారు. దక్షిణ భారతదేశంలో అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాల్లో సభలు నిర్వహించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్లు చెప్పారు. బుధవారం నాంపల్లిలోని గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరికాదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని, బాధ్యత వహించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు పారదర్శక చర్యలు అవసరమని పేర్కొన్నారు.

# న్యాయస్థానం ఆదేశాల మేరకు జాకారం సర్పంచ్ దాసరి సమతను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

## అడిషనల్ కలెక్టర్, డీపీవోకు వినతిపత్రం అందజేత.. కోర్టు ఉత్తర్వుల ప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి



**ములుగు, అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా జాకారం గ్రామ సర్పంచ్ దాసరి సమతను న్యాయస్థానం ఆదేశాల మేరకు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మూడు నెలల పాటు సస్పెన్షన్‌కు గురైన దాసరి సమతకు సంబంధించి గౌరవ న్యాయస్థానం స్టే ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, ఆమెను తిరిగి సర్పంచ్‌గా విధులు నిర్వహించేందుకు అనుమతించాలని వారు కోరారు. ఈ మేరకు గ్రామస్తులు, సంబంధిత ప్రతినిధులు అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) వెంకయ్యలను నేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ దాసరి సమత సస్పెన్షన్‌ను నిలిపివేస్తూ న్యాయస్థానం జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల ప్రతిని అధికారులకు సమర్పించారు.

**న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయాలి**

న్యాయస్థానం జారీ చేసిన స్టే ఉత్తర్వుల నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని సర్పంచ్ దాసరి సమతను తిరిగి విధుల్లోకి తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఈ విషయంలో అనవసర జాప్యం చేయకుండా న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీ పరిపాలన సజావుగా సాగేందుకు న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం చర్యలు తీసుకోవడం అవసరమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఉత్తర్వుల ప్రతిని అధికారులకు అందజేసి, తమ విజ్ఞప్తిని వివరించారు. ఈ కార్యక్రమంలో జాకారం గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని సర్పంచ్ దాసరి సమతను తిరిగి విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

# ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఎడ్ల అనిల్ రెడ్డి

## - ఏకగ్రీవంగా ప్రకటించిన జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్

**మల్లంపల్లి, అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మల్లంపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు ఎడ్ల అనిల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ ఆయన నియామకాన్ని ప్రకటించారు. యువజన కాంగ్రెస్‌లో చురుకుగా పనిచేస్తున్న అనిల్ రెడ్డికి జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడంతో మల్లంపల్లి కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి కుంజా సూర్య సూచనలతో ఈ నియామకం చేపట్టినట్లు ఇస్సార్ ఖాన్ తెలిపారు. మల్లంపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ల్యాద శ్యామ్ రావు సూచనలు, సహకారంతో అనిల్ రెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ మాట్లాడుతూ, ములుగు జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా నియమితులైన ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డి కృషి చేయాలని ఆకాంక్షించారు. యువతను కాంగ్రెస్ పార్టీకి మరింత చేరువ చేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సీనియర్, జూనియర్ నాయకుల మధ్య సమన్వయాన్ని పెంపొందిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో మల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ సాధించే దిశగా యువ నాయకులు సమష్టిగా పనిచేయాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనిల్ రెడ్డి నాయకత్వంలో యువజన కాంగ్రెస్ మరింత చురుకుగా పనిచేస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ, ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఎడ్ల అనిల్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# దివ్యాంగుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం మై భారత్, ఎస్ఆర్డిఎస్, ఎనేబుల్ ఇండియా కృషి

## - 35 మంది దివ్యాంగులకు సర్టిఫికెట్ల ప్రదానం 20 మందికి వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్ పంపిణీ




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** దివ్యాంగులు ఆర్థికంగా బలోపేతమై, స్వయం ఉపాధి ద్వారా గౌరవప్రదమైన జీవనం సాగించాలనే లక్ష్యంతో మై భారత్, శ్రీ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఎస్ఆర్డిఎస్), ఎనేబుల్ ఇండియా సహకారంతో చేపట్టిన స్వయం ఉపాధి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఖమ్మం నగరంలోని రోటరీ క్లబ్ మీటింగ్ హాల్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో స్వయం ఉపాధి శిక్షణ పూర్తి చేసిన 35 మంది దివ్యాంగులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయడంతో పాటు, 20 మంది దివ్యాంగులకు వారి వ్యాపార అవసరాలకు అనుగుణంగా వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్, సహాయక పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమం దివ్యాంగుల జీవనోపాధి మెరుగుదలకు, ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేలా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మై భారత్ ఖమ్మం జిల్లా కన్వీనర్ రాంబాబు మాట్లాడుతూ... దివ్యాంగులు ఆర్థికంగా అభివృద్ధి సాధించి, స్వయంగా వ్యాపారాలు నిర్వహిస్తూ సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలని ఆకాంక్షించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి, వారి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, వారు ఆర్థికంగా బలోపేతం కావడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఎస్ఆర్డిఎస్ సంస్థ డైరెక్టర్ గడ్డం రాంబాబు మాట్లాడుతూ.. ఎనేబుల్ ఇండియా సహకారంతో దివ్యాంగులకు పది రోజుల పాటు వ్యాపార నైపుణ్య శిక్షణ అందించి, సొంతంగా వ్యాపారాలు ప్రారంభించుకునేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.



శిక్షణ పొందిన వారికి వారి వ్యాపార అవసరాలకు అనుగుణంగా వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్, అవసరమైన పరికరాలను అందించడం ద్వారా స్థిరమైన జీవనోపాధి అవకాశాలను కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. దివ్యాంగులు తమలోని నైపుణ్యాలను గుర్తించి, స్వయం ఉపాధి రంగంలో రాణిస్తూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు. శిక్షణ, తగిన పరికరాలు, నిరంతర ప్రోత్సాహం అందిస్తే దివ్యాంగులు కూడా విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగగలరని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా 35 మంది దివ్యాంగులకు శిక్షణ పూర్తి చేసిన గుర్తింపుగా సర్టిఫికెట్లు అందగా, మరో ముఖ్యమైన ముందడుగుగా 20 మంది దివ్యాంగులకు వ్యాపార నిర్వహణకు ఉపయోగపడే వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్ అందించడం జరిగింది. ఈ చర్యలు దివ్యాంగుల సాధికారతకు, స్వయం ఉపాధి అభివృద్ధికి దోహదపడనున్నాయి. ఎస్ఆర్డిఎస్ ప్రతినిధులు, ఎనేబుల్ ఇండియా గ్రామ కమిటీ ప్రతినిధులు, దివ్యాంగ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగులకు నైపుణ్యాలు నేర్పిద్దాం ఉపాధి అవకాశాలు కల్పిద్దాం ఆర్థిక స్వావలంబనతో సమాన అవకాశాల సమాజాన్ని నిర్మిద్దాం.

# ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు

- కల్లూరు రైతు వేదికలో రైతులకు శిక్షణ



**కల్లూరు, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త ఫణి శ్రీ తెలిపారు. కల్లూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఫణి శ్రీ, మండల వ్యవసాయ అధికారి రూప పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఫణి శ్రీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవ ఎరువుల వినియోగం, జీవామృతం, ఘన జీవామృతం తయారీ, వాటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అమలు చేయవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి రూప మాట్లాడుతూ రైతులు పంటల్లో సమతుల్య పోషక యాజమాన్యాన్ని పాటించాలని, రసాయన ఎరువులు, పురుగుమందులను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తమ పొలాల్లో ఆచరణలో పెట్టి, అందుబాటులో ఉన్న సహజ వనరులను వినియోగించుకోవాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు వ్యవసాయ అధికారులు సాగుకు సంబంధించిన సాంకేతిక సలహాలు, సూచనలు అందించారు.

# హబ్సిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా చింతకింది ప్రవీణ్ నియామకం

## - పార్టీ బలోపేతానికి కృషి చేస్తా ప్రజా సమస్యలపై పోరాడతా: చింతకింది ప్రవీణ్



**ఉప్పల్ అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** హబ్సిగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా చింతకింది ప్రవీణ్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా చింతకింది ప్రవీణ్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ హబ్సిగూడ డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, పార్టీ అధిష్ఠానం ఇచ్చే పిలుపు మేరకు నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేస్తానని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తానని, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు. పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు గిరి వర్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ కౌన్సిలర్ తిండేరు హనుమంతరావుకు చింతకింది ప్రవీణ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# శ్రీ మైసమ్మ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు: అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**అంబర్‌పేట్, అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** జైస్వాల్ గార్డెన్‌లోని శ్రీ శ్రీ శ్రీ మైసమ్మ దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం నుండి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో కాలనీవాసులు, పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో అంబర్‌పేట్ మాజీ కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డి, గోల్నాక మాజీ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, అంబర్‌పేట్ అడిషనల్ డి.సి.పి. నర్సయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చెరుకు యాదవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. ఇంద్రసేన్ యాదవ్, చైర్మన్ ఎన్. రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు కె. దిలీప్ గౌడ్, కోశాధికారి పి. వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే చీఫ్ సలహాదారులు జి. ప్రసన్నాంజనేయులు, జి. సురేందర్, ఎ. రామగౌడ్, బి. మధుసూదన్ చారి, పి. శ్రీహరి చారిలతో పాటు కమిటీ సభ్యులు పి. రామస్వామి, కె. ఈశ్వరయ్య, కె. అశోక్ కుమార్, టి. కృష్ణవేణి పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మయ్య గౌడ్, ఎ. సత్యనారాయణ, చింతల శ్రీనివాస్ ముదిరాజ్, స్వామి గౌడ్, పర్వాతలు, కె. సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, విజయ్ బాబు, శ్రీనివాస్ గుప్తా, కె. శ్రీధర్, రాకేష్, నరేష్, రాంచందర్ రావు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.





# రామగుండం సీ.పీని కలిసిన ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మాద్ హుస్సేన్



**రామగుండం, అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మాద్ హుస్సేన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా ఎంఐఎం నాయకులు, రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను, పోలీస్ కమిషనరేట్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు కలిసినట్లు గులాం అహ్మాద్ హుస్సేన్ తెలిపారు. గులాం అహ్మాద్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత పెద్దపల్లి జిల్లా నాయకులతో కలిసి, రామగుండం పోలీసు కమిషనర్ ను కలవడం పార్టీలో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈసందర్భంగా గులాం అహ్మాద్ హుస్సేన్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం, తమ వంతుగా పోలీసు శాఖకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పెద్దపల్లి నాయకులు ఇమ్రాన్ అడ్వకేట్, ఉమేర్, కలీం, గోదావరిఖని నాయకులు మీర్ జాకీర్ అలీ, ఖాదర్ అలీ నాయబ్, రామగుండం నాయకులు నసిర్, ఆర్బాజ్, కరీంనగర్ నాయకులు అబ్దుల్ గఫ్ఫార్, మెరాజోద్దీన్, షాకిర్ నహ్ది, అబ్దుల్లాఖాన్, అయాన్ నహ్ది తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి.

**• 111 మందిలబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.**




**గంగాధర, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో అనారోగ్యంతో, ప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి నియోజకవర్గం లోని వివిధ గ్రామాలకు చెందిన 111 మంది లబ్ధిదారులకు రూ. 31,08,700 ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థిక సాయం మంజూరు అయింది. కాగా బుధవారం గంగాధర ప్రజా కార్యాలయంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ పంపిణీ చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల కంటే రెట్టింపు చెక్కులను కేవలం మూడేళ్లలోనే పంపిణీ చేసినట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ తో తమను ఆదుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, వేముల భాస్కర్,రేండ్ల శ్రీనివాస్, చిందం ఆంజనేయులు, బిర్ల ఆనందం, రాచమల్ల రవి,బాసవేణి శ్రీనివాస్,దాసరి శంకరయ్య ఈటవేణి శ్రీనివాస్, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, దానే అనసూయ ఓదెలు, కడారి రేణుక కనకయ్య, సంధ్య చంద్రారెడ్డి, కవిత మల్లేశం, బాబా లక్ష్మి మధు, పురుమల్ల మనోహర్, సాగి అజయ్ రావు, చిరుతమంగ, తోట సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ దారం నాగభూషణం 9వ వర్ధంతి సందర్భంగా 58వ డివిజన్‌లో మున్సిపల్ కార్మికులకు కిట్ల పంపిణీ



**కరీంనగర్, అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ ప్రముఖులు డాక్టర్ దారం నాగభూషణం 9వ వర్ధంతిని పురస్కరించుకొని కరీంనగర్‌లోని 58వ డివిజన్‌లో మున్సిపల్ కార్మికులకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి, వారికి తోడ్పాటు అందించే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దారం నాగభూషణం కుమారుడు డాక్టర్ రఘురామన్, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ కార్పొరేటర్ సోహన్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల సేవలను అభినందిస్తూ, సమాజ ఆరోగ్య పరిరక్షణలో వారు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. డాక్టర్ దారం నాగభూషణం వర్ధంతిని సేవా కార్యక్రమం ద్వారా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.

# గుజ్జ సత్యంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలి

**పద్మశాలి మహాజన సంఘం తీర్మానం**

**బీసీ ఉద్యమం, విద్యా, వైద్య, చేనేత రంగాల్లో సేవలను గుర్తించాలని విజ్ఞప్తి**



**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** బీసీ వర్గాల హక్కుల సాధనతో పాటు విద్యా, వైద్య, సామాజిక సేవా రంగాల్లో కృషి చేస్తున్న గుజ్జ సత్యం (గుజ్జ సత్యనారాయణ)కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కల్పించాలని భూదాన్ పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు మాట్లాడుతూ బీసీల హక్కులు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం గుజ్జ సత్యం చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. భూదాన్ పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో అనుభవం ఉన్నవారి సేవలను సమాజ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. చేనేత కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి బ్యాంకు మాజీ చైర్మన్ చిట్టిపోలు శ్రీనివాస్ సైతం గుజ్జ సత్యం సేవలను గుర్తించి ఎమ్మెల్సీ పదవికి ఆయన పేరును పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు అంకం మురళి మాట్లాడుతూ చేనేత కార్మికుల వృత్తి పరిరక్షణ, జీవనోపాధి మెరుగుదల, సామాజిక భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. సంఘం కార్యదర్శి భరత బాలరత్నం విద్యారంగంలో గుజ్జ సత్యం అందిస్తున్న సేవలను ప్రస్తావించారు. పద్మశాలి ప్రముఖుడు బడుగు చెండికేశ్వర్లు మాట్లాడుతూ చేనేత కుటుంబాలు, యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. **బీసీ హక్కుల కోసం కృషి** గుజ్జ సత్యం జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడిగా, బీసీ జేఏసీ రాష్ట్ర సమన్వయకర్తగా బీసీల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నారని సమావేశంలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, కులగణన, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై ఆయన చేస్తున్న కృషిని గుర్తించాలని కోరారు. సుమారు రెండు దశాబ్దాలుగా విద్యారంగంలో సేవలందించడంతో పాటు సత్యం హోమియోపతి ద్వారా వైద్య సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశానికి యువజన సంఘాల ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ సామాజిక సంస్థల బాధ్యులు, పద్మశాలి సంఘాల ప్రముఖులు, యువజన నాయకులు హాజరయ్యారు. గుజ్జ సత్యం సేవలను పరిగణనలోకి తీసుకుని, రాజ్యాంగ నిబంధనలు, అర్హతలకు అనుగుణంగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవికి ఆయన పేరును పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పద్మశాలి మహాజన సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# సోదరీమణుల ఆత్మీయతకు ప్రతీక బతుకమ్మ వేడుకలు



**బతుకమ్మ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ**



**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ ఆకాంక్షించారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఖమ్మం జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల పోస్టర్‌ను కలెక్టర్ దివాకర్ టి.ఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ బుధవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. టీజీవో రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు మహిళా విభాగం అధ్యక్షురాలు జి. ఉషాశ్రీ, కార్యదర్శి పి. సుధారాణి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్ మహిళా అధికారులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. తంగేడు, గునుగు తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు ఆటపాటలతో సంబరాలు జరుపుకోవడం తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు. మహిళా అధికారుల మధ్య ఐక్యత, స్నేహభావం పెంపొందించడంతో పాటు సంప్రదాయాలపై గౌరవాన్ని చాటిచెప్పడమే ఈ వేడుకల ఉద్దేశమని వివరించారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగను మహిళలంతా భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి గుడికందుల జ్యోతి, టీజీవో రాష్ట్ర మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు, ప్రిన్సిపాల్ విజయకుమారి, డీడబ్ల్యూఓ ప్రమీల, ఉద్యాన శాఖ అధికారి రాధిక, జిల్లా ఉపాధి అధికారి మాధవి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కరుణ, నాగలక్ష్మి, మాధవి, కుసుమకుమారి, ఇందిర, నాగమణి తదితర మహిళా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగినులు పాల్గొన్నారు.

# 'సర్' తుది ఓటరు జాబితాలో పేర్ల నమోదుకు మరో అవకాశం

**ఈ నెల 15, 16 తేదీల్లో పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు**



**కరీంనగర్, అక్టోబర్ 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** 'సర్' ఓటరు తుది జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించారు. ఈ నెల 15, 16 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరాల్లో కొత్త ఓటర్లుగా నమోదు కావడంతో పాటు, ఇప్పటివరకు జాబితాలో పేరు చేరని అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా గతంలో దరఖాస్తులకు గడువు ఇచ్చారు. అయితే ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మరో రెండు రోజులు అవకాశం కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 15, 16 తేదీల్లో ఫారం-6 సమర్పించిన అర్హుల పేర్లను నవంబర్ 9న ప్రకటించనున్న తుది జాబితాలో చేర్చే అవకాశం ఉంటుందని తెలిపారు. **ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి** ఓటర్లు ఇప్పటికే ప్రకటించిన ముసాయిదా జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు. పేర్లు లేకపోయినా, వివిధ కారణాలతో నమోదు కాకపోయినా కుటుంబ సభ్యులతో కలిసి ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జాబితాలో తప్పులు ఉన్నట్లయితే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఎవరూ ఓటరు జాబితాలో పేరు నమోదు కాకుండా మిగిలిపోకూడదని సీఈవో సుదర్శన్‌రెడ్డి సూచించారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం!

**హనుమకొండలో జరిగే సన్నాహక సమావేశానికి సీరోల్ మండల కాంగ్రెస్ నాయకులు తరలిరావాలి**

**సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడగం లక్ష్మీనారాయణ పిలుపు**

**(సీరోల్, అక్టోబర్ 14 పిసిడబ్ల్యు న్యూస్):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని సీరోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడగం లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఈ నెల 15వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు హనుమకొండలోని హంటర్ రోడ్డులో ఉన్న డీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి సీరోల్ మండల



కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మంత్రులు ధనసరి అనసూయ (సీతక్క), పొన్నం ప్రభాకర్, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్‌తో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో చర్చించనున్న నేపథ్యంలో మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని బుడగం లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు.

# దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలకు ఉండాలి: కరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్

**రామడుగు అక్టోబర్ 14 (పిసిడబ్ల్యు న్యూస్):** రామడుగు మండల కేంద్రంలో కురుమ యువసేన ఆధర్వంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి ఇట్టి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గామాత సన్నిధిలో కుంకుమ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుంకుమార్చన చేసి మొక్కులు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమానికికరీంనగర్ మేయర్ కోలగాని శ్రీనివాస్ పాల్గొని ఆయనమాట్లాడుతూ



దుర్గామాత ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు అనంతరం భక్తుల కోసం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని పాల్గొన్నారు. భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనని అన్నప్రసాదాన్ని స్వీకరించారు, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది ఈ కార్యక్రమంలో కురుమ సంఘ నాయకులు యూత్ క్లబ్ సభ్యులు గ్రామస్తులు మహిళలు గ్రామ పెద్దలు యువకులు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దేవి యువసేన ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నప్రసాద వితరణ

**- అమ్మవారిని దర్శించుకున్న బిజెపి కార్పొరేటర్ కేపీపీ చంద్ర**

**కరీంనగర్, అక్టోబర్ 14(పిసిడబ్ల్యు న్యూస్):** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 'శ్రీదేవి యువసేన' ఆధ్వర్యంలో 19వ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుగుతున్నాయి . నిత్య పూజా కార్యక్రమాలతో దేవి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలతో ప్రాంగణమంతా భక్తిపారవశ్యంతో, కోలాహలంగా మారింది. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రోజున ఎల్ ఎం డి కాలనీ, రామ్‌లీలా మైదాన్ ప్రాంగణంలో భక్తుల కోసం 'మహా అన్నప్రసాదం' వితరణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా ఏర్పాటు చేశారు. కరీంనగర్ బిజెపి కార్పొరేటర్ కే పీపీ చంద్ర గారు శ్రీ దేవి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక భక్తులతో కలసి మహా అన్నప్రసాద



వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్పొరేటర్ ఏపీపీ చంద్ర మాట్లాడుతూ శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం శ్రీ దేవి యువసేన సభ్యులు ఎంతో నిష్ఠతో, భక్తితో ప్రజలకు అన్నప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు



అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై సదా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ దేవి యువసేన కుటుంబ సభ్యులు, నిర్వాహకులు కొత్తూరి శ్రీనివాస్, బట్టు కరుణాకర్, కడార్ల శ్రీనివాస్, ప్రదీప్ , భవాని దీక్షపరులు , పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# మరిపెడలో ఘనంగా ఐదో రోజు బతుకమ్మ వేడుకలు

**- మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న డాక్టర్ ప్రమీల.. పూల పండుగతో మార్మోగిన మరిపెడ**

**మరిపెడ, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు మరిపెడ మండల కేంద్రంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు బతుకమ్మ వేడుకలను మహిళలు అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటపాటలతో పండుగ సంబరాలను అంబరాన్నంటేలా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమీల మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ సందడిని పంచుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా జరుపుకోవడం విశేషం. పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో మరిపెడ మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో



బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఐదో రోజు బతుకమ్మ వేడుకల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మున్సిపల్ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, మరిపెడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్, టౌన్ అధ్యక్షులు రామ్ లాల్, జిల్లా నాయకులు, మరిపెడ మాజీ మండల అధ్యక్షులు పెండ్లి రఘు రెడ్డి, జిల్లా యువజన నాయకులు నరసింహారెడ్డి, గుండబోయిన వేణు, సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ మహాశక్తి దేవాలయంలో మహాచండి దేవిగా అమ్మవారి దర్శనం

**- పసుపుకొమ్ముల అలంకరణలో శ్రీ మహాదుర్గ అమ్మవారు**





**కరీంనగర్,అక్టోబర్14(పీసీడబ్ల్యు న్యూస్):** శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మహాశక్తి దేవాలయంలో బుధవారం నాల్గవ రోజు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ మహాదుర్గ అమ్మవారు శ్రీ మహాచండి దేవి (కూష్మాండ) అవతారంలో పసుపుకొమ్ముల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవార్ల దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలో నవరాత్రి ఉత్సవాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి.

# ఇంజనీర్ కోల అన్నారెడ్డికి ఘన సన్మానం



**కరీంనగర్, అక్టోబర్ 14(పిసిడబ్ల్యు న్యూస్):** కరీంనగర్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో ఇంజనీర్ కోల అన్నారెడ్డి గ 1,961 ఓట్లు సాధించి, మొత్తం 17 మంది అభ్యర్థుల్లో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సాధించిన విజయాన్ని పురస్కరించుకొని, శ్రీపురం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సమాజ సేవ, సేవాభావం కలిగిన ఇంజనీర్ కోల అన్నారెడ్డి భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని ఉత్తమమైన సేవలను అందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డాక్టర్ బంక మల్లేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బంక శ్రీలక్ష్మి , చీపిరిశెట్టి సత్యనారాయణ , నల్ల రాజయ్య సతీష్, పిస్క లక్ష్మీనారాయణ, పిట్టల శ్రీనివాస్ , చావ నాగేశ్వరరావు, మద్ది నారాయణ, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ దుర్గా భవానీ దేవి ఆలయానికి పోటెత్తిన భక్తజనం.. వైష్ణవీ రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు!



**కరీంనగర్, అక్టోబర్ 14(పిసిడబ్ల్యు న్యూస్):** కరీంనగర్ జిల్లా నగునూర్ గ్రామంలో వెలసిన శ్రీ దుర్గా భవానీ దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీ దుర్గ భవానీ దేవి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. ఆలయ ప్రాంగణమంతా "జై భవానీ.. జై జై భవానీ" నామస్మరణతో మారుమోగింది. గరుడ వాహనంపై ' అమ్మవారు పసుపు రంగు పట్టు చీరను ధరించి, విశేషంగా వైష్ణవీ దేవి అలంకరణలో భక్తులకు అమ్మవారు దివ్య దర్శనమిచ్చారు. గరుడ వాహనంపై శోభాయమానంగా కొలువుదీరిన జగన్మాతను దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా కరీంనగర్ జిల్లా న్యాయమూర్తి (డిస్ట్రిక్ట్ జడ్జి) శ్రీ దుర్గా భవానీ దేవిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వారికి ఘనస్వాగతం పలికిన నిర్వాహకులు, ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించారు. పూజల అనంతరం వేదపండితులు న్యాయమూర్తికి వేదాశీర్వచనం తో పాటు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ములుగు జిల్లా కోర్టులో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా వేడుకలు.. పాల్గొన్న జిల్లా న్యాయమూర్తులు, న్యాయవాదులు**



**ములుగు, అక్టోబర్ 14( పిసిడబ్ల్యు న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ములుగు జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, సంప్రదాయ పాటలతో కోర్టు ప్రాంగణంలో పండుగ సందడిని నెలకొల్పారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్య చంద్రకళ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. చందేశ్వరి దేవి, సీనియర్ సివిల్ జడ్జి టి. కన్నయ్య లాల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బలుగు చంద్రయ్యతో పాటు పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షిస్తూ, భావితరాలకు పండుగల విశిష్టతను చాటిచెప్పేలా ఈ వేడుకలు నిర్వహించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఒకచోట చేరి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడంతో కోర్టు ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# కొత్తూరు(సి) సర్పంచ్ చిన్నిని పరామర్శించిన డాక్టర్ ప్రమీల





**కురవి, అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం కొత్తూరు(సి) గ్రామ సర్పంచ్ బాదావతు చిన్ని ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోగా, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్ సతీమణి డాక్టర్ ప్రమీల బుధవారం ఆమె నివాసమైన గుజిలితండాకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా చిన్ని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలగాని శ్రీనివాస్, దంతాలపల్లి మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గిరివాణి.కొత్తూరు(సి) గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మలిశెట్టి వేణు, ఉపసర్పంచ్ పగడాల కృష్ణారెడ్డి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి మేఘన, యూత్ మండల ప్రధాన కార్యదర్శి కోర్ని అనిల్, బాదావతు సిరి నాయక్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బానోత్ జోషి నాయక్



**మల్లంపల్లి, అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా నూతన మండలమైన మల్లంపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లంపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు బానోత్ జోషి నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్ ఆయన నియామకాన్ని ప్రకటించారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కుంజా సూర్య సూచనలతో ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. మల్లంపల్లి మండలంలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ, సీనియర్, జూనియర్ నాయకుల సమన్వయంతో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని ఇస్సార్ ఖాన్ ఆకాంక్షించారు. నూతన అధ్యక్షుడు బానోత్ జోషి నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# పేదలందరికీ సమన్యాయం కోసం ఈడబ్ల్యూఎస్ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి

- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతో ఓసీ జేఏసీ నాయకుల భేటీ



**హైదరాబాద్, అక్టోబర్ 14(పిసిడబ్ల్యూ న్యూస్):** అన్ని వర్గాల్లోని పేదలకు సమన్యాయం చేకూరేలా ఆర్థిక ఆధారిత రిజర్వేషన్ల (ఈ డబ్ల్యు ఎస్) సాధన ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ ఓసీ జేఏసీ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, ఉద్యమ లక్ష్యాలను వివరించారు. ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు, జాతీయ చైర్మన్ నల్లా సంజీవరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తాడిశెట్టి పశుపతి, ప్రోగ్రామ్ రాష్ట్ర కో-ఆర్డినేటర్లు అప్పమ్మగారి రాంరెడ్డి, పైళ్ల హరినాథ్ రెడ్డి, దయాకర్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ విన్నపంపై మందకృష్ణ మాదిగ సానుకూలంగా స్పందించారని ఓసీ జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు తెలిపారు. రిజర్వేషన్లలో క్రిమీలేయర్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారానే అట్టడుగు వర్గాల పేదలకు నిజమైన న్యాయం జరుగుతుందనే అభిప్రాయాన్ని మందకృష్ణ వ్యక్తం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# కన్నెగంటి వెంకటయ్యకు ప్రతిష్ఠాత్మక పురస్కారం




**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ సాహితీవేత్త, గజల్ గాయకుడు, ప్రధానోపాధ్యాయుడు కన్నెగంటి వెంకటయ్యకు దాశరథిసినారె గజల్ కవి పురస్కారం లభించింది. గుంటూరులో బుధవారం భారతీయ విద్యా భవన్, గజల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ గజల్ శ్రీనివాస్, విలన్ శరత్ చంద్ర చేతుల మీదుగా ఆయన శాలువా, ప్రశంసాపత్రం, పురస్కార జ్ఞాపికతో సత్కారం అందుకున్నారు. తెలుగు గజల్ రచన, గాన రంగాల్లో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ కనకదుర్గ అమ్మవారి మహా చండీ హోమం

## వైభవంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి మహా చండీ హోమం

## 13వ వార్షికోత్సవాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



**ములుగు అక్టోబర్14(పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా బండారుపల్లి గ్రామంలో శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి 13వ వార్షికోత్సవ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈరోజు శ్రీ కనకదుర్గ అమ్మవారు మహా చండీశ్వరి రూపంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈ సందర్భంగా లోకకళ్యాణం, ప్రజల సుఖసంతోషాలు, గ్రామాభివృద్ధి, సర్వజన శ్రేయస్సును ఆకాంక్షిస్తూ ప్రత్యేక మహా చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు సందీపాచార్యుల పర్యవేక్షణలో వేదమంత్రోచ్ఛారణల నడుమ హోమ కార్యక్రమం ఘనంగా జరిగింది. హోమగుండం వద్ద అర్చకులు నిర్వహించిన ప్రత్యేక పూజలు, మంత్రోచ్చారణలు, భక్తుల అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. **భక్తులకు ఆధ్యాత్మిక సేవలందిస్తున్న ఉత్సవ కమిటీ** శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అమ్మవారి వార్షికోత్సవాలను భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించేలా నిర్వహించడం విశేషం. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాల నిర్వహణలో కమిటీ సభ్యులు సమష్టిగా కృషి చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సేవాభావంతో ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ముద్దసాని మహేందర్, ఉపాధ్యక్షులు కేత్తే సురేష్, కేశెట్టి నవీన్, కమిటీ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మహా చండీ హోమం అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, లోకమంతా సుభిక్షంగా వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. భక్తుల భాగస్వామ్యం, కమిటీ సభ్యుల సమష్టి కృషితో 13వ వార్షికోత్సవ మహోత్సవాలు భక్తి వైభవాల మధ్య కొనసాగుతున్నాయి.

# పూల పండుగలో పరిమళించిన ఆత్మీయత

- ఖమ్మం గణేష్‌నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు
- 150 మంది మహిళలకు బహుమతులు అందజేత











**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్):** రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. సంప్రదాయ దుస్తుల్లో మహిళల సందడి.. పాటలు, ఆటలతో వెల్లివిరిసిన ఆనందం.. ఇలా ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ గణేష్‌నగర్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ జిల్లా నాయకులు తోట రామారావు, తోట గోవిందమ్మ దంపతుల ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళలు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడి, ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ వేడుకలు గణేష్‌నగర్‌లో పండుగ వాతావరణాన్ని నింపాయి. **150 మంది మహిళలకు బహుమతులు** వేడుకల్లో భాగంగా బతుకమ్మలతో పాల్గొన్న 150 మంది మహిళలకు బహుమతులు అందజేశారు. జి. జ్యోతి ప్రథమ, ఎం. ఉమా ద్వితీయ, సీహెచ్ మానస తృతీయ బహుమతులు అందుకున్నారు. మిగిలిన 147 మంది మహిళలకు కూడా ప్రత్యేక బహుమతులు అందించి నిర్వాహకులు ప్రోత్సహించారు. **సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి** ఈ సందర్భంగా తోట రామారావు, తోట గోవిందమ్మ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయత, ఐక్యతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అని అన్నారు. పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వేడుకలు మహిళల మధ్య అనుబంధాలను పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేసీ కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పగడాల నాగరాజు, మాటేటి కిరణ్, తోట రమేష్, డాక్టర్ తోట లక్ష్మణ్, రాకం శ్యాంబాబు, పోలెపొంగు వెంకట్, మేకల అనురాధ, నామ అనిత, కొండిశెట్టి పుణ్యవతి, పున్న అమల, గంధసిరి పద్మ, జలగం తిరుపతమ్మ, బీఎస్ఎన్ఎల్ వీరస్వామి, నామా విక్రమ్, శాబాస్ సాయి, అరవింద్, ఓంకారమ్మ, దేవబత్తిని రాము, సునీత, తరుణ్, శాబాస్ రమణ, తోకల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన 5వ రోజు అట్లబతుకమ్మ సంబరాలు!

- నృత్యాలు, కోలాటాలతో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు
- మహిళలు, బతుకమ్మలతో మార్మోగిన టీడీపీ కార్యాలయం ప్రాంగణం

**ఖమ్మం ప్రతినిధి, అక్టోబర్ 14 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం టిడిపి కార్యాలయంలో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ చుట్టూ సంప్రదాయబద్ధంగా ఆడిపాడుతూ సందడి చేశారు. భక్తి గీతాలకు లయబద్ధంగా నృత్యాలు చేస్తూ, కోలాటాలు ఆడుతూ తమ ఆనందోత్సాహాలను చాటుకున్నారు. రంగురంగుల గాజుల అందాలు, మహిళల కోలాట విన్యాసాలు, బతుకమ్మ పాటలతో కార్యాలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహిళల సామూహిక నృత్యాలు, భక్తుల సందడితో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడం విశేషంగా నిలిచింది.





# అనుమతి లేకుండా నా పేరు వాడతారా?



**- వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్ నిర్వాహకులపై శిఖర్ ధావన్ ఆగ్రహం.. చట్టపరమైన చర్యలకు సిద్ధం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** టీమిండియా మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ తన అనుమతి లేకుండానే 'వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్' టోర్నమెంట్‌లో తన పేరును ఉపయోగించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై నిర్వాహకుల తీరును తప్పుబట్టిన ఆయన, సమస్యను పరిష్కరించేందుకు తమ బృందం తగిన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా టోర్నీలో పాల్గొనే ఆటగాళ్ల జాబితాలో తన పేరును చేర్చడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. **అనధికార ప్రకటనలను నమ్మొద్దు** వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్‌లో తాను పాల్గొంటున్నట్లు ప్రచారం జరగడంపై ధావన్ స్పష్టత ఇచ్చారు. తన పేరు టోర్నమెంట్‌లో పాల్గొనే ఆటగాళ్ల జాబితాలో ఉన్నట్లు గుర్తించానని, అయితే ఇందుకు తన అనుమతి తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, తమ బృందం తగిన న్యాయపరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తన అభిమానులు, మీడియా సంస్థలు అధికారిక అనుమతి లేని ప్రకటనలను నమ్మవద్దని, వాటి ఆధారంగా వార్తలు ప్రచారం చేయవద్దని కోరారు. **ఆసియా వారియర్స్ జట్టుతో వివాదం** వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్‌కు సంబంధించి ఆసియా వారియర్స్ జట్టులో ధావన్ పేరు ప్రకటించడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. ఈ జట్టులో భారత్‌తో పాటు పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక తదితర దేశాలకు చెందిన ఆటగాళ్ల పేర్లు కూడా ప్రచారంలోకి వచ్చాయి. అయితే తన భాగస్వామ్యంపై వచ్చిన ప్రకటనను ధావన్ ఖండించడంతో టోర్నమెంట్ నిర్వహణ, ఆటగాళ్ల అనుమతి వంటి అంశాలపై చర్చ మొదలైంది. **అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష గుర్తింపు**శిఖర్ ధావన్ భారత క్రికెట్ జట్టులో కీలక ఓపెనర్‌గా గుర్తింపు పొందారు. ముఖ్యంగా వన్డే క్రికెట్‌లో తనదైన ముద్ర వేశారు. భారత్ తరఫున 167 వన్డేలు ఆడి 6,793 పరుగులు సాధించారు. ఇందులో 17 శతకాలు, 39 అర్ధశతకాలు ఉన్నాయి. టెస్టు క్రికెట్‌లో 34 మ్యాచ్‌ల్లో 2,315 పరుగులు చేయగా, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 68 మ్యాచ్‌లు ఆడి 1,759 పరుగులు సాధించారు.**తదుపరి పరిణామాలపై ఆసక్తి** ప్రముఖ క్రికెటర్ల పేర్లను టోర్నమెంట్ల ప్రచారంలో ఉపయోగించే ముందు వారి అనుమతి తీసుకోవాల్సిన అవసరంపై ఈ ఘటన చర్చకు దారితీసింది. ధావన్ ప్రకటించిన చట్టపరమైన చర్యలు ఏ రూపంలో ముందుకు సాగుతాయి? నిర్వాహకులు ఈ ఆరోపణలపై ఎలాంటి వివరణ ఇస్తారు? అనే అంశాలు ఆసక్తికరంగా మారాయి. ఈ వ్యవహారంలో తదుపరి పరిణామాలు వెల్లడికావాల్సి ఉంది.

## పిచ్‌ను అర్థం చేసుకోకపోవడంతోనే

# సంజూ శాంసన్ ఔట్!



**- అభిషేక్ శర్మ నెమ్మదిగా ఆడటంతో ఒత్తిడికి గురయ్యాడు.. మాజీ క్రికెటర్ పుజారా విశ్లేషణ**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 14:** వెస్టిండీస్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తక్కువ పరుగులకే ఔట్ కావడానికి గల కారణాలను మాజీ భారత క్రికెటర్ ఛతేశ్వర్ పుజారా విశ్లేషించారు. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి సంజూ మరికొంత సమయం తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ కూడా క్రీజులో కుదురుకునేందుకు సమయం తీసుకోవడంతో సంజూపై ఒత్తిడి పెరిగిందని పేర్కొన్నారు. ఈ కారణంగా వేగంగా పరుగులు సాధించాలనే ప్రయత్నంలో సంజూ వికెట్ కోల్పోయాడని వివరించారు.**పిచ్ పరిస్థితులను అర్థం చేసుకోవాల్సింది** వెస్టిండీస్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో సంజూ శాంసన్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 82 పరుగులు సాధించాడు. అయితే మూడో టీ20లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. కేవలం ఆరు బంతులు ఎదుర్కొని మూడు పరుగులకే వెనుదిరిగాడు. ఈ ప్రదర్శనపై స్పందించిన పుజారా.. బ్యాటర్ క్రీజులోకి వచ్చిన వెంటనే దూకుడుగా ఆడటం కంటే, పిచ్ స్వభావాన్ని అంచనా వేసుకోవడం ముఖ్యమని సూచించారు.అభిషేక్ శర్మ కూడా ప్రారంభంలో వేగంగా పరుగులు చేయలేకపోవడంతో సంజూపై ఒత్తిడి పెరిగిందని చెప్పారు. జట్టు తరఫున పరుగుల వేగాన్ని పెంచాల్సిన పరిస్థితి ఏర్పడటంతో సంజూ ముందుగానే దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాడని, అదే అతడి వికెట్ కోల్పోవడానికి కారణమైందని విశ్లేషించారు. బౌలర్ వేసిన బంతి కూడా బాగుందని, అయినప్పటికీ క్రీజులో మరికొంత సమయం గడిపి ఉంటే సంజూ మెరుగైన ఇన్నింగ్స్ ఆడే అవకాశం ఉండేదని అభిప్రాయపడ్డారు.**ఇషాన్ కిషన్‌పై ప్రశంసలు**భారత బ్యాటర్ ఇషాన్ కిషన్ ప్రదర్శనను పుజారా ప్రశంసించారు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్న ఇషాన్.. జట్టు అవసరాలకు అనుగుణంగా ఆడుతున్నాడని పేర్కొన్నారు. టాప్ ఆర్డర్‌లో దూకుడుగా ఆడే బ్యాటర్లకు సహకరిస్తూ పవర్‌ప్లేలో వీలైనన్ని పరుగులు సాధించేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిపారు.ప్రతి మ్యాచ్‌లోనూ బ్యాటర్ భారీ స్కోరు సాధించాల్సిన అవసరం లేదని పుజారా అభిప్రాయపడ్డారు. జట్టు పరిస్థితులకు తగ్గట్టుగా ఆడి 30 నుంచి 40 పరుగులు సాధించినా అది విలువైన సహకారమేనని చెప్పారు. వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు విజయానికి ఉపయోగపడే ఇన్నింగ్స్‌లు ఆడటం ముఖ్యమని వివరించారు.**సిరీస్‌లో భారత్ ఆధిక్యం**వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ కీలక ఆధిక్యాన్ని సాధించేందుకు ప్రయత్నిస్తోంది. సంజూ శాంసన్ రెండో మ్యాచ్‌లో అద్భుతంగా రాణించినప్పటికీ, తదుపరి మ్యాచ్‌లో తక్కువ పరుగులకే ఔట్ కావడం చర్చనీయాంశమైంది. బ్యాటర్లు పిచ్ పరిస్థితులను అర్థం చేసుకొని, పరిస్థితులకు అనుగుణంగా తమ ఆటతీరును మార్చుకోవాలని పుజారా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.టీ20 క్రికెట్‌లో దూకుడైన బ్యాటింగ్ ఎంత ముఖ్యమో, సరైన సమయంలో సంయమనం పాటించడం కూడా అంతే అవసరం. ఆరంభంలో వికెట్లు కోల్పోకుండా జాగ్రత్తగా ఆడుతూ, అనంతరం పరుగుల వేగాన్ని పెంచగలిగితే జట్టుకు మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మళ్లీ ముంబై ఇండియన్స్

# కెప్టెన్‌గా రోహిత్ శర్మ!

**ఒక్క సామాజిక మాధ్యమ పోస్ట్‌తో అభిమానుల్లో జోష్.. 2027 ఐపీఎల్‌పై భారీ అంచనాలు**



**ముంబై, అక్టోబర్ 14:** ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన ముంబై ఇండియన్స్‌లో కెప్టెన్సీ మార్పుపై మరోసారి చర్చ మొదలైంది. భారత స్టార్ క్రికెటర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ తిరిగి జట్టు పగ్గాలు చేపట్టనున్నాడనే ప్రచారం క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 2027 ఐపీఎల్ సీజన్‌లో ముంబై ఇండియన్స్ నాయకత్వ బాధ్యతలను రోహిత్‌కు అప్పగించే అవకాశం ఉందంటూ వార్తలు వెలువడుతున్నాయి. జట్టు సామాజిక మాధ్యమ ఖాతాలో చేసిన ఓ పోస్టు ఈ ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది. అయితే, కెప్టెన్సీ మార్పుపై జట్టు యాజమాన్యం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.**ఒక్క పోస్టుతో మొదలైన చర్చ**ముంబై ఇండియన్స్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో ఆటగాళ్లను ప్రత్యేక పేర్లతో పరిచయం చేస్తూ ఓ పోస్టు చేసింది. అందులో రోహిత్ శర్మను 'కింగ్'గా పేర్కొనడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఈ పోస్టును చూసిన అభిమానులు రోహిత్ తిరిగి కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడనే సంకేతంగా భావిస్తున్నారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో రోహిత్ కెప్టెన్సీ పునరాగమనంపై చర్చ జోరందుకుంది.అయితే, ఓ పోస్టులో రోహిత్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం మాత్రమే కెప్టెన్సీ మార్పునకు నిర్ధారణ కాదని గమనించాలి. 2027 సీజన్‌కు సంబంధించి ముంబై ఇండియన్స్ యాజమాన్యం తీసుకునే నిర్ణయమే ఈ అంశంపై స్పష్టత ఇవ్వనుంది.**ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన నాయకుడు**ముంబై ఇండియన్స్ విజయాల్లో రోహిత్ శర్మ పాత్ర ఎంతో కీలకం. అతడి నాయకత్వంలో జట్టు 2013, 2015, 2017, 2019, 2020 సంవత్సరాల్లో ఐదు ఐపీఎల్ టైటిళ్లను కైవసం చేసుకుంది. ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం, ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపడం రోహిత్ నాయకత్వ ప్రత్యేకతలుగా నిలిచాయి.ఈ విజయాల కారణంగా ముంబై ఇండియన్స్ అభిమానుల్లో రోహిత్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అతడు మళ్లీ కెప్టెన్‌గా బాధ్యతలు చేపడితే జట్టు పూర్వ వైభవాన్ని తిరిగి అందుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. రోహిత్ అనుభవం, నాయకత్వ సామర్థ్యం జట్టుకు ఉపయోగపడతాయని వారు భావిస్తున్నారు.**హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై ఉత్కంఠ**ప్రస్తుతం ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా కొనసాగుతున్నాడు. ఈ నేపథ్యంలో తదుపరి సీజన్‌కు ముందు జట్టు నాయకత్వంలో మార్పులు చోటుచేసుకుంటాయా? హార్దిక్‌నే కొనసాగిస్తారా? లేక రోహిత్‌కు మరోసారి సారథ్య బాధ్యతలు అప్పగిస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గత కొన్ని సీజన్లలో ముంబై ఇండియన్స్ ప్రదర్శనలో నిలకడ లేకపోవడం కూడా కెప్టెన్సీపై చర్చకు కారణమవుతోంది. జట్టు యాజమాన్యం భవిష్యత్తు ప్రణాళికల్లో భాగంగా నాయకత్వంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. అయితే, హార్దిక్‌ను తప్పిస్తారనే వార్తలకు లేదా రోహిత్ తిరిగి కెప్టెన్ అవుతాడనే ప్రచారానికి ఇప్పటివరకు అధికారిక నిర్ధారణ లేదు.**అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు**2027 ఐపీఎల్ సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్ తీసుకునే నిర్ణయాలపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రోహిత్ శర్మ తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు చేపడితే జట్టు వ్యూహాల్లో మార్పులు రావడంతో పాటు అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొనే అవకాశం ఉంది. మరోవైపు, ప్రస్తుత నాయకత్వాన్ని కొనసాగించాలని యాజమాన్యం నిర్ణయిస్తే దానికి అనుగుణంగా జట్టు భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించనుంది. మొత్తానికి, ఒక్క సామాజిక మాధ్యమ పోస్టుతో మొదలైన ఈ చర్చ ఇప్పుడు ఐపీఎల్ అభిమానుల్లో ఆసక్తికర అంశంగా మారింది. అయితే, ఊహాగానాలకు తెరపడాలంటే ముంబై ఇండియన్స్ యాజమాన్యం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే.

## మహాశక్తి ఆలయంలో సందడిగా

# దాండియా వేడుకలు

**• దాండియా కార్యక్రమాన్ని వీక్షించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



**కరీంనగర్, అక్టోబరు 14 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న దాండియా వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మహిళలు, యువతులు, భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా దాండియా నృత్యాల్లో పాల్గొంటూ సందడి చేశారు. భక్తి గీతాల నడుమ సాగిన నృత్యాలతో ఆలయ పరిసరాలు పండుగ శోభను సంతరించుకున్నాయి.ఈ వేడుకలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వీక్షించారు. ఆలయానికి వచ్చిన ఆయన నిర్వాహకులు, భక్తులతో కలిసి దాండియా కార్యక్రమాన్ని తిలకించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాల్లో పాల్గొన్నారు.దేవీ నవరాత్రి ఉత్సవాల్లో దాండియా నృత్యాలకు ప్రత్యేక స్థానం ఉంది. సంప్రదాయ నృత్యాల ద్వారా అమ్మవారిపై భక్తిని చాటుతూ మహిళలు, యువతులు బృందాలుగా నృత్యాలు చేశారు. లయబద్ధమైన అడుగులు, భక్తి గీతాలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఉత్సవాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించడంతోపాటు సంప్రదాయ కళలు, సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పట్టణ శాసనసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, కరీంనగర్ నగర మేయర్ శ్రీనివాస్, ఉపమేయర్ సునీల్‌రావు పాల్గొన్నారు. ప్రముఖుల రాకతో కార్యక్రమానికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఆలయ నిర్వాహకులు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శ్రీ మహాశక్తి దేవాలయంలో భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక వైభవం కలగలిసిన పండుగ వాతావరణం నెలకొంది.



# బుమ్రాపైనే ఆధారపడతారా?: భారత బౌలింగ్‌పై శ్రీకాంత్ విమర్శలు



న్యూఢిల్లీ: భారత బౌలింగ్ విభాగంపై మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ విమర్శలు చేశారు. జస్ప్రీత్ బుమ్రాపైనే ఆధారపడకుండా, మరింత మంది నాణ్యమైన బౌలర్లను తయారు చేసుకోవాలని సూచించారు. ఒక్క మ్యాచ్‌లో విఫలమైనంత మాత్రాన కుల్దీప్ యాదవ్‌పై నమ్మకం కోల్పోకూడదని అభిప్రా యపడ్డారు. యువ బౌలర్లకు అవకాశాలు కల్పించి, వారిని ప్రోత్సహించాలని పేర్కొన్నారు. కీలక సమయా ల్లో వికెట్లు తీసే బౌలర్లు జట్టుకు అవసరమని స్పష్టం చేశారు.



# ఏడేళ్ల వైవాహిక బంధానికి ముగింపు!

### - భర్త హరి వినయ్‌తో విడాకులు తీసుకున్న బుల్లితెర నటి ఐశ్వర్య పిస్సే

బెంగళూరు, అక్టోబర్ 14: కన్నడ, తెలుగు బుల్లితెర నటి ఐశ్వర్య పిస్సే తన వైవాహిక జీవితానికి ముగింపు పలికారు. భర్త హరి వినయ్‌తో పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. గత ఏడాదిన్నర కాలంగా తామిద్దరం వేర్వేరుగా ఉంటున్నామని తెలిపారు. తమ వ్యక్తిగత జీవితంపై వస్తున్న వదంతులకు ముగింపు పలికేందుకే ఈ ప్రకటన చేసినట్లు పేర్కొన్నారు.తమ నిర్ణయాన్ని గౌరవించి, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించవద్దని ఐశ్వర్య అభిమానులు, సామాజిక మాధ్యమ వినియోగదారులను కోరారు. వీక్షణలు, ఇష్టాలు పెంచుకోవడానికి తప్పుడు కథనాలు సృష్టించడం, సీరియళ్లలోని సన్నివేశాలను నిజ జీవితానికి ముడిపెట్టి ప్రచారం చేయడం సరికాదని హెచ్చరించారు. నిరాధారమైన ఆరోపణలు, పరువు నష్టం కలిగించే ప్రచారం కొనసాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఐశ్వర్య పిస్సే కన్నడతో పాటు తెలుగు బుల్లితెరపై కూడా గుర్తింపు పొందారు. 'అగ్నిసాక్షి', 'సర్వమంగళ మాంగల్యం', 'అనురూప', 'గిరిజా కల్యాణం', 'సుందరి' వంటి సీరియళ్లతో ప్రేక్షకులకు చేరువయ్యారు. వ్యక్తిగత జీవితంపై ఊహాగానాలు చేయకుండా, తమ గోప్యతను గౌరవించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# 400 కుటుంబాలకు అండగా రష్మిక మందన్న!

### మూడు నెలలపాటు నిత్యావసర సరుకుల పంపిణీ.. 'అన్నపూర్ణ' పేరుతో సేవా కార్యక్రమం



హైదరాబాద్: ప్రముఖ నటి రష్మిక మందన్న తన గొప్ప మనసును చాటుకున్నారు. ఏకంగా 400 కుటుంబాలకు అండగా నిలుస్తూ, మూడు నెలలపాటు నిత్యావసర సరుకులు అందించనున్నట్లు ప్రకటించారు. 'అన్నపూర్ణ' పేరుతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'రణబాలి' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రష్మిక ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. సినిమాలో తాను పోషించిన జయమ్మ పాత్ర తనపై ప్రభావం చూపిందని, అవసరంలో ఉన్నవారికి సాయం చేయాలనే ఆలోచన తనకు ఎప్పటి నుంచో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కుటుంబాల నిత్యావసరాల ఖర్చు తగ్గి, భవిష్యత్తు కోసం కొంత పొదుపు చేసుకునే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# నితిన్ సరసన ఆఫియా సయ్యద్.. 'అలియాస్ రుక్మిణి'లో కథానాయిక పరిచయం!

**హైదరాబాద్:** యువ కథానాయకుడు నితిన్ నటిస్తున్న తాజా చిత్రం 'అలియాస్ రుక్మిణి'లో కథానాయికగా బాలీవుడ్ నటి ఆఫియా సయ్యద్ నటిస్తున్నారు. ఈ చిత్రంతో ఆమె తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. నాని నిర్మాణంలో, 'దండోరా' చిత్రంతో గుర్తింపు పొందిన మురళీకాంత్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. తాజాగా చిత్రబృందం రుక్మిణి పాత్రను పరిచయం చేస్తూ ఓ ప్రచార వీడియోను విడుదల చేసింది. అందులో "మా ఆవిడ రుక్మిణి.. చాలా క్రమశిక్షణతో ఉంటుందండీ!" అనే సంభాషణతో పాత్రపై ఆసక్తిని పెంచింది. నితిన్ పాత్రకు రుక్మిణికి మధ్య ఎలాంటి అనుబంధం ఉంటుంది? కథలో ఆమె పాత్రకు ఎంత ప్రాధాన్యం ఉంటుంది? అనే విషయాలపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.విభిన్న కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రానికి ఇప్పటికే విడుదలైన ప్రచార దృశ్యాల ద్వారా మంచి ఆసక్తి ఏర్పడింది. ప్రస్తుతం చిత్రీకరణ కొనసాగుతుండగా, డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.



# రాష్ట్రపతి భవన్‌లో 'రామాయణం' ప్రత్యేక ప్రదర్శన!

### - నవంబర్ 5న విడుదలకు సిద్ధం



న్యూఢిల్లీ: ప్రముఖ దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక పౌరాణిక చిత్రం 'రామాయణం'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని నవంబర్ 5న రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించే అవకాశాలున్నట్లు సమాచారం. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటిస్తున్నారు. సన్నీ డియోల్ హనుమంతుడి పాత్రలో కనిపించనున్నారు. భారతీయ ఇతిహాసమైన రామాయణాన్ని భారీ వ్యయంతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తెరకెక్కిస్తున్నారు.రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంలో మొదటి భాగంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ప్రత్యేక ప్రదర్శనకు అనుమతి లభిస్తుందా? ప్రముఖుల సమక్షంలో చిత్రాన్ని ప్రదర్శిస్తారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



# 'జార్జ్ క్రిష్' చిత్ర బృందానికి పూరి జగన్నాథ్ సర్‌ప్రైజ్!

హైదరాబాద్: ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ తన స్నేహితుడు, దర్శకుడు శ్రీను వైట్లకు అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు. శర్వానంద్ కథానాయకుడిగా, శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'జార్జ్ క్రిష్' సినిమా చిత్రీకరణ స్థలానికి పూరి జగన్నాథ్ వెళ్లి చిత్ర బృందాన్ని ఆశ్చర్యపరిచారు.చాలా ఏళ్లుగా స్నేహబంధాన్ని కొనసాగిస్తున్న వీరిద్దరి కలయికతో శ్రీను వైట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. చాలా కాలం తర్వాత తన స్నేహితుడు చిత్రీకరణ స్థలానికి రావడం ఆనందంగా ఉందని సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు.ఈ సందర్భంగా పూరి జగన్నాథ్ కూడా చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. "ఎప్పటికీ నువ్వు నా బెస్ట్ ఫ్రెండ్‌వే భయ్యా.. ఈ సినిమాతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవాలి" అంటూ తన స్నేహితుడిపై అభిమానాన్ని చాటుకున్నారు.ఇద్దరు ప్రముఖ దర్శకుల మధ్య ఉన్న స్నేహబంధం, పరస్పర ప్రోత్సాహం సినీ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సంఘటనకు సంబంధించిన చిత్రాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.



# నిరసనలపై బ్రహ్మాజీ వ్యాఖ్యలు.. సామాజిక మాధ్యమాల్లో దుమారం!

**హైదరాబాద్:** ప్రముఖ నటుడు బ్రహ్మాజీ సామాజిక మాధ్యమాల్లో చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, ఆందోళనలను ఉద్దేశిస్తూ ఆయన చేసిన పరోక్ష వ్యాఖ్యలపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు."నిరసన తెలపడం ఇప్పుడు కొత్త వృత్తిగా మారిపోయింది" అంటూ బ్రహ్మాజీ చేసిన వ్యాఖ్య ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నీట్ పరీక్షకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు, ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ సాగుతున్న నిరసనలను ఎగతాళి చేసేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు.ప్రజా సమస్యలపై విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు నిరసన తెలపడం ప్రజాస్వామ్యంలో వారి హక్కు అని నెటిజన్లు పేర్కొంటున్నారు. ఆందోళనకారుల పోరాటాలను తక్కువ చేసి మాట్లాడటం సరికాదంటూ కొందరు అభిప్రాయపడుతున్నారు. బ్రహ్మాజీ తన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని, క్షమాపణ చెప్పాలని మరికొందరు డిమాండ్ చేస్తున్నారు.ఈ వ్యాఖ్యలతో బ్రహ్మాజీ మరోసారి సామాజిక మాధ్యమాల్లో చర్చకు కేంద్రంగా మారారు. అయితే, ఆయన వ్యాఖ్యలపై వస్తున్న విమర్శల నేపథ్యంలో తదుపరి స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.